



ఆ నాలుగు ముక్కలు కార్డులో నింపేటప్పటికే రామనాథం మాస్టరుగారి వేళ్ళు కొంకర్లుపోయినట్లైనాయి. ఆ వ్రాసిందాన్ని మరోమారు జారిన కళ్ళజోడులోనుంచి పరిశీలించారు. తృప్తిగా ఓ నిట్టూర్పు విడిచారు. పోస్టు డబ్బాలో లోతట్టుగా చేయిపెటి ఆ ఉత్తరాన్ని జారవిడిచారు. ఈ జీవన పోరాటంలో ఎన్నెన్నో ఆటుపోటులతో ఆఖరి అధ్యాయానికి చేరిన ఆ దేహంలో శక్తి ఉడిగిపోయింది. అవయవాల్లో చేవ, చైతన్యం జారిపోయినై. శరీరమంతా ఏదో నిస్త్రాణగా వుంటే పోస్టాఫీస్ వరండా మీద కూలబడ్డారు రామనాధంగారు.

"మాస్టారూ?"

తల యెత్తి చలమయ్యవైపు చూశారు రామనాధంగారు.

"డబ్బు గూర్చేనా మళ్ళీ విశ్వానికి ఉత్తరం?"

రామనాధం మాస్టారి ముఖం అవమానంతో, అభిమానంతో కప్పుకుపోయింది ఒక్కక్షణం. తల యెత్తి చలమయ్యవైపు చూశారు.

"వాడు నా కొడుకు. యోగక్షేమాలు తెల్సుకోవటంలో నా ఆరాటం నాకుండవే వుంటుంది."

ఉచితము! ఉచితము!

తెల్ల మచ్చలు

అన్నిరకాల మచ్చలను. ఎరుపురంగును మా ప్రఖ్యాతమందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి.

వివరాలకు:

BHARATAYURVEDASHRAM(M)
Post Katri Sarai (Gaya)

డా॥ పి.వి.కె.రావ్. B.A సెక్ స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్ - వైద్యాచార్య హస్తప్రయోగం. నరముల బలహీనత అంగము చిన్నదగుట. శీఘ్రస్ఖలనము. శుక్లనష్టము సుఖరోగములకుమానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టు ద్వారా కూడా చికిత్స చేయబడు

రామ్మాస క్లినిక్

టి. బి. రోడ్, తెనాలి. ఫోన్ : 100.

SUVARNA




జర్మన్ 'దెగుసా' పాళీలతో ప్రత్యేకమైన కలాలు. అన్ని రకముల కలములకు రిపేరు మా ప్రత్యేకత.

"నా దగ్గర కూడా దాపరికమెందుకు మాస్టారూ. విశ్వం ఈ నెల మీకు డబ్బు పంపలేదు. పోస్ట్ మాస్టర్‌గా నేనేగదా ఆ డబ్బును ముందు స్వీకరించేది."

"ఏవో ఇబ్బందుల్లో వున్నాడేమో."

"ఉంటే మాత్రం ఈ వృద్ధాప్యంలో తండ్రిని గాలికి వదిలేసాడా? ఆయన ఉసురు పోసుకుంటాడా?"

"ఇందులో ఉసురు ప్రశ్నేముంది చలమయ్యా: పిచ్చి సన్యాసి: అక్కడెన్ని ఇబ్బందుల్లో వున్నాడో. ఈ కరువు రోజుల్లో ఈదుకురావటం మాటలా? ఆనాటికీ ఈనాటికీ ఎంత వ్యత్యాసం? ఏ వస్తువైనా అమ్మబోతే అడవి, కొనబోతే కొరివి. ఏ లోటూ లేకుండా వాడి బ్రతుకు వెళ్ళమారిపోతే నాకు చాలదూ."

విశ్వంమీది మమకారంతో రామనాథం గారి మనసు ఆర్ద్రమైంది.

"కొడుకుమీద ఈగని వాలనివ్వరుగదా; సరే. ఈ డబ్బు వుంచండి విశ్వం పంపిన వెంటనే సర్దుదురుగాని"


ఓ నాలుగు పది కాగితాల నోట్లు రామనాథంగారి చేతుల కందించబోయాడు చలమయ్య.

"ఇప్పుడెందుకు?"

"నా తృప్తికోసం వుంచండి మాస్టారూ. కాదంటే నా మనసు క్షోభపడుతుంది."

అయిష్టంగానే ఆ డబ్బు తీసికొన్నారు రామనాథంగారు. చలమయ్య నుంచి సెలవు తీసుకొని ఇంటిముఖం పట్టారు. జీవిత సారాన్నంతా కాచి వడబోసినట్లు కన్పించే ముడుతలు ముసురుకొన్న వదనం, వెండి తీగెలల్లుకొన్న తల, లోతుకుపోయిన కళ్ళకు ఆసరాగా దళసరి అద్దాలజోడు. రామనాథంగారి రూపం కనుమరుగయ్యేంత వరకూ చూసి చలమయ్య కూడా వెనుదిరిగాడు.

ఇంటికొచ్చిన రామనాథంగారు నీరసంగా పడకకుర్చీలో వాలిపోయారు. ఇల్లంతా బోసి కొడుతున్నది. ఆ లంకంత కొంపకు ఏకైక ప్రతినిధిగా తాను బ్రతుకు తెరువు రీత్యా విశ్వం దూరమైపోతే, పరమాతుని పిలుపందుకుని తన అర్ధాంగి అర్ధంతరంగా తన్నొదిలి వెళ్ళిపోయింది. ఆ సగభాగం, ముఖ్యంగా ఈ వయసులో లేని లోటెంతటిదో తెలిసొచ్చి రామనాథం గారి కళ్ళు చెమ్మగిల్లినాయి. ఈ వయసులో తనకీ శ్రమ, ఏకాకితనం తప్పు కొన్నప్పుడల్లా కొడుకు విశ్వంమీద అసంతృప్తి కార్చిచ్చులా మనసును ఆవహించబోయేది అయితే ఆదిలోనే ఆ మంటలు ఎటూ అల్లుకోకుండా ఆర్పేసుకోగల్గారు



రామనాథంగారు ఓర్మి, వైరాగ్యం అనే నీళ్ళుజల్లి. తను విశ్వానికి వ్రాసిన ఉత్తరంలో వాడి మనసును బాధించేదేదీ అధికంగా వ్రాయలేదుకదా! ఆ నాలుగు మాటల్ని మళ్ళీ ఒకసారి స్ఫురణకు తెచ్చుకొన్నారు రామనాథంగారు.

"చిరంజీవి విశ్వాన్ని దీవిస్తూ....

నాన్న.... ఇక్కడ నేను క్షేమం. పెద్దగా విశేషాలేమీలేవు వ్రాయటానికి. వీలుంటే కొంత డబ్బు పంపు. అక్కడ నీవేమీ అవసలు పడకు. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోగలవు. కోడలి పిల్లకు, చిట్టితల్లికీ నా ఆశీసులు.

ఇట్లు
నీ తండ్రి రామనాథం"

ఈ నాలుగు మాటలు విశ్వానికి వ్రాయటానికి మానసికంగా తనెందుకు వెనకాముందూ ఆడాల్సి వస్తున్నది? కొడుకు తండ్రిని అడగటం. తండ్రి వృద్ధాప్యంలో కొడుకుపై ఆధారపడటం తప్పా! వాడూ డబ్బుకోసం తనకూ ఇలాగే వ్రాసేవాడు. ఈనాడుతనూ ఇంతే. వాడు పంపకపోతే తనకు వేరే దిక్కేది? నాలుగు వేళ్ళూ నోటోకి పోయేదెట్లా? జీవుడున్నంతరకూ ఈ యాతన తప్పదుగదా, తను విశ్వానికి భారమవుతున్నాడేమోనన్న ఆలోచనతో అప్పుడప్పుడూ రామనాథంగారి మనసు ఆక్రోశించేది. తమకు తామే మళ్ళీ జీవన ధర్మాన్ని స్ఫురణకు తెచ్చుకొని శాంతి చెందేవారు. పెంచి పెద్దజేసి విద్యాబుద్ధులు చెప్పించి, ఓ దారి చూపిన తనయుని కనీస బాధ్యతగాదా వృద్ధాప్యంలో వున్న వారిని ఆదుకోవటం. ఈ అనుబంధమే లేనప్పుడు అసలు ఈ రక్త స్పర్శలకు, మమతానురాగాలకు అర్ధమేమిటి?

తన చరమ జీవితాన్ని వెళ్ళమార్చాల్సిన బాధ్యత చేతికంది వచ్చిన కొడుకుదేగదా! తన చివరి అధ్యాయానికి అంతిమగీతం పాడాల్సింది వాడేకదా! అటువంటప్పుడు విశ్వంపై ఆధారపడ్డంలో అనౌచిత్య మేముంది? ఆలోచనల్తో రామనాథంగారి మనసు అలిసిపోయింది. కళ్ళు మత్తుతో వాలిపోతుంటే ఆ పడక కుర్చీలోనే ఒకింత కన్ను మూశారు.

చలమయ్య వచ్చి తట్టి పిల్చేంతవరకూ రామనాథంగారిలో ఆ మత్తు వదల్లేదు. భారంగా కళ్ళు తెరిచి చలమయ్య వైపు చూశారు.

"విశ్వం నుంచి లేఖ వచ్చింది మీకు. ఇచ్చిపోదామనే వచ్చాను." ఆర్తంగా ఆ ఉత్తరాన్నందుకున్నారు రామనాథం గారు. చదవబోతే అక్షరాలన్నీ అలికినట్లుగా, ముదపోసినట్లుగా కన్పించినై. తిరిగి చలమయ్యకే ఇస్తూ "ఏం వ్రాశాడో చదువు చలమయ్యా" అన్నారు రామనాథం గారు.

చలమయ్య ఓ నిమిషం తటపటాయించాడు. చివరకు తప్పదన్నట్లుగా ఆ ఉత్తరాన్ని చదివాడు.

"నాన్నగారికి....

మీరు డబ్బు కోసం వ్రాస్తున్న ఉత్తరాలన్నీ అందుతున్నై. అదే పనిగా మీరు వ్రాసినా, కోరినంతా పంపటం నాకు సాధ్యంకాదు. నాతో పాటు నా అవసరాలూ ఇక్కడ పెరుగుతుంటై గదా. వీలున్నప్పుడు నేనే పంపుతుంటాను. ఉత్తరాలు వ్రాయకండి. అన్నట్లు ఆ ఇల్లు మనకెందుకు? దాన్ని అమ్మివేస్తే మీకూ నాకూ ఆ డబ్బు ఉపయోగపడుతుంది ప్రస్తుతం. ఆలోచించండి. చిన్న బుజ్జి ఇప్పుడిప్పుడే నడక నేర్చుకొంటున్నది.

ఇట్లు
విశ్వం"

చదవటం పూర్తిచేసి ఆ ఉత్తరాన్ని తిరిగి రామనాథంగారికి ఇచ్చివేశాడు చలమయ్య. రామనాథంగారి దృష్టి ఇక్కడ లేదు. ముఖంలో విషాదపు పొరలు. అంతరాంతరాళాల్లో అంతర్లీనంగా పొర్లి పొంగుతున్న వ్యధ, నరనరాల్లో కంపన. చలమయ్యతో ఏదో అందామని నోరు తెరిచిన రామనాథంగారి స్వరం డగ్గుత్తిక పడింది.

"మాస్టారూ, విశ్వం విషయంలో నేను పొరబడలేదని ఇప్పుడైనా తెలిసికొంటున్నారా? తండ్రీ కొడుకుల బంధం కూడా వ్యాపారంగానే మిగిలిపోయిందిమాస్టారూ. ఏదో ఆనాటి వాళ్ళు మాత్రం ఇంకా ఈ అనుబంధాలు పెట్టుకొని అల్లాడిపోతున్నారుగాని, ఈ కాలం వాళ్ళకి వాళ్ళ ఆశలు, అభిరుచులు, సుఖాలు తప్ప వేరే ఏమీ పట్టవు."

రామనాథంగారిలో ఏటువంటి చలనం లేకపోవటంతో చలమయ్య కంగారుగా ఆయన్ని తట్టి పిల్చారు.

"వింటూనే వున్నాను చలమయ్యా. నా విశ్వం అందరిలాటివాడుకాదు" రామనాథంగారి గుండెలు రెపరెపలాడుతున్నా పైకి గుంభనంగానే అన్నారు.

ఆశ్చర్యంగా రామనాథంగారి వైపు చూశాడు చలమయ్య.

"సరే మాస్టారూ, నా డ్యూటీకి టైం అయింది. మళ్ళీ కలుస్తాను" అంగీకారంగా తలూపారు రామనాథంగారు.

"లోగడ మీకు విశ్వం వ్రాసిన ఉత్తరాలన్నీ వున్నాయా!"

"అవెక్కడికి పోతాయి చలమయ్యా, అవి నాకు పూజా పత్రాలు."

"ఒకసారి నాకిస్తారా అవి?"

రామనాథంగారు చలమయ్యవైపు చూశారు. ఆ చూపులో సందేహం కన్నా, ఇప్పుడు వాటితో ఏం పని అన్న భావమే చదవగలిగాడు చలమయ్య.

"మీకు అభ్యంతరం లేకపోతే నే మాస్టారూ. మళ్ళీ వాటిని నేనే తీసుకువచ్చి మీకిస్తా."

"నీ విషయంలో అభ్యంతరమేముంటుంది చలమయ్యా. విశ్వానికి నేనెంతో నీవూ అంతేగా. అదిగో ఆ మూల పెట్టెలో వున్నాయి చూడు."

చలమయ్య లేచి వెళ్ళి ఆ పెట్టె తెరిచాడు. పాతగుడ్డ ముక్కలో అతిభద్రంగా చుట్టబడివున్నాయి ఆ ఉత్తరాలు. అవి చేతిలోకి తీసుకొంటూ,

"మాస్టరుగారూ. ఈ వయసులో ఈ ఒంటరితనం మీ కెందుకండీ. నామాట విని విశ్వాన్ని ఇక్కడకే రమ్మనమని వ్రాయండి. కొడుకు, కోడలు చెంతనుంటే మీకూ ఇంత ఆసరా, తృప్తి. నన్ను వ్రాయమంటే నేనే వ్రాస్తాను విశ్వానికి."

రామనాథంగారి ముఖం ముడుచుకుపోయింది చలమయ్య సలహాతో.

ఆయన అవయవాలన్నీ అయిష్టతతో కంపించినై.

"ఇక్కడే మున్నది చలమయ్యా. నేనెట్లా బ్రతికానో చూడు. ఎదుగూ బొదుగూ లేని ఈ జీవితం వాడి కొద్దు. పైకి పోయే వాడిని, గంపెడంత భవిష్యత్తు కలవాడిని నా తోడుకోసం ఇక్కడికి తెచ్చి ఈ రొంపిలో దింపమంటావా? ఈ తెగ్గోతల జీవితం వాడి కెందుకు చలమయ్యా."

"మరి మీకు నా అనేవాళ్ళు వుండొద్దు మాస్టారూ?"

మీ బిడ్డ సంతోషంగా ఉండాలంటే




అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్ ఇవ్వండి

బిడ్డ ఆపకుండా ఏడుస్తూ ఉంటే జీర్ణశక్తి బాగాలేదేమో! పాలకి అమృతాంజన్ లిమిటెడ్‌వారి గ్రైప్‌మిక్స్చర్ ఇవ్వండి. నులినొప్పి, వాయువు, అజీర్ణం వల్లవచ్చే కాలంలో ఇబ్బందులు త్వరగా తగ్గిపోతాయి బిడ్డ ఇంకా సంతోషంగా ఉంటుంది

అమృతాంజన్ లిమిటెడ్

OBM-2640 TG

"ఆ, పండి రాలటానికి సిద్ధంగా వున్న నాకు ఇంక ఆసరాలేమిటి? ఆ పైవాడి పిలుపుకు ఎదురు చూడటమేగా" నిర్వికారంగా అన్నారు రామనాథంగారు. విస్మయంగా ఆయన వైపు చూశాడు చలమయ్య. జీవం ఆరిపోయిన ఆ లోతు కళ్ళల్లో కొడుకుపట్ల మిణుకు మిణుకుమంటూ వెలిగే ఆశలు, సంధ్య వాలిపోతున్న ఆయన ముఖంలో, విశ్వం పేరు వినగానే ప్రాకిపోయే పరవశ ఛాయలు, ఉన్నా లేకున్నా ఒకే విధంగా నెటుకుపోగల గంభీరతత్వంగల మాస్టర్‌గారి నుంచి వేరే ఏమీ ఆశించటం తన వంటి వాడి వల్ల కాదని చలమయ్యకు తెలుసు. రామనాథంగారి వద్ద సెలవు తీసికొని చలమయ్య వెళ్ళిపోయాడు ఆ ఉత్తరాల కట్టతో.

కొన్ని క్షణాలు నిశ్చలంగా శూన్యంలోకి చూస్తూ వుండిపోయిన రామనాథంగారి మనసు క్రమేపీ ఆలోచనల సుడిగుండమే అయింది. ఆయన గుండెలు బరువుతో ఉగబట్టుకుపోయాయి. ఈ రాపిడికి తట్టుకోలేనట్లుగా ఆయన అన్ని అవయవాలనుండీ వేడి బయలుదేరింది.

తాను విశ్వానికి భారంగా వున్నాడా? వృద్ధులైన తల్లిదండ్రులే సంతానానికి భారమైపోయినపుడు ఇహ వృద్ధాప్యమనేది ఎందుకు? ఎవరిని మురిపించటానికి? ఎవరిని ఉద్ధరించటానికి? చలమయ్య అన్నట్లు తండ్రీ కొడుకుల ఈ పవిత్రబంధం వ్యాపారమెలా అవుతుంది? ఇచ్చిపుచ్చుకోవటం అంతకన్నా ఎలా అవుతుంది? ఇది సృష్టి, ఇది ధర్మం, ఇదే జీవితచక్రం.

విశ్వాన్ని తనూ అనుమానిస్తున్నాడా? అసహ్యించుకుంటున్నాడా? ఛ....ఛ; తన నరనరంలో వాడిమీద మమకారమే నిండి వుంది. వాడు తన ఆత్మకు ప్రతిరూపం. తన వాత్సల్యాల ప్రోగు. నిజమే; ఈ వాత్సల్యపాశం నుంచి తప్పుకొని బయటపడటం తన వల్లకాదు. ఈ రక్త స్పర్శ ఆకర్షణ నుండి విడివడి నిలబడటం తనకు సాధ్యంకాదు. విశ్వం తోడిదే తన లోకం. వాడికోసం. వాడి సౌఖ్యంకోసం ఏదైనా చేయాలి తను. వాడి అభిరుచులు వాడివి. తండ్రిగా తానుమాత్రం ఆసరా అందీయవద్దూ? ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు వాడనుభవించేది, చెయ్యాలి; వాడి సుఖంకోసం తానెంతటి త్యాగమైనా చెయ్యాలి. వాడు వ్రాసినట్లు ఈ ఇల్లు అమ్మివేస్తేనో; ఆ ఇంటి కప్పు వైపే రెండు నిమిషాలు చూస్తూ వుండిపోయారు రామనాథంగారు. తన తండ్రికి, తనకూ ఇంత ఆశ్రయమిచ్చి, కడుపులో పెట్టుకొని కాపాడిందా ఇల్లు. తన తండ్రి రక్తం ధార పోసి కట్టిన ఇల్లు. తన కొడుక్కి నిష్ప్రయోజనంగా వుంది.

రామనాథంగారి మనసులో ఘర్షణ మొదలైంది. అంతరంగంలో ప్రశ్నలు ముసురుకున్నాయి. క్షణం తర్వాత ఆ ప్రశ్నలకేదో సమాధానం దొరికినట్లు ఆయన ముఖం కాంతివంతమైంది. చెట్టంత కొడుకే భౌతికంగా దూరంగా వున్నప్పుడు తనకు ఈ ఇల్లు వుండి మాత్రం ఏం వొరగబెడుతుంది? ఏం త్రవ్వి తలకెత్తుతుంది? తనతోపాటు ఈ ఇల్లూ ఎప్పుడో భూమిలో కల్సిపోవల్సిందేగా? తలకింద కొరివిబెట్టే ఒక్కగానొక్క కొడుకు అవసరాలు తీరటమే తనకు ముఖ్యం. ఈ ఇల్లు అమ్మేస్తాను. వాడు కోరినట్లే చేస్తాను. అసలు వాడు పుట్టినపుడు తనూ, అదీ ఎన్ని కలలుకన్నాం? వాడి భవిష్యత్తు మీద ఎన్ని ఆశలు పెంచుకొన్నాం? ఏ లోటూ లేకుండా వాడు పెరిగి పైపైకి పోవాలని, తనవంటి సామాన్యుడు, కొడుకునింత వృద్ధిలోకి ఎట్లా తీసుకు రాగలిగాడా అని అంతా అబ్బురపడాలని, ఇంకా ఎన్నో తలపోశాడు తాను. గ్రాడ్యుయేషన్‌తోనే వాడి చదువు ఆగిపోతే తన ప్రాణం ఎంత అల్లాడిపోయింది! ఎంతగా నచ్చచెప్పినా ఇహ ముందుకు చదవనన్నాడు వాడు. తన మనసెంత ఆక్రోశించినా, వాడి కెదురు చెప్పటం ఇష్టంలేక అప్పటికి సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఏమైనాసరే వాడు కోరినట్లే ఈ ఇల్లు అమ్మేస్తాను.

ఇప్పుడు రామనాథంగారి మనసు కొడుకు పంపని డబ్బు మీద లేదు. కొడుకు అక్కడ ఎన్ని అవస్థలు పడుతున్నాడో, ఎన్ని కష్టాలు ఎదుర్కొంటున్నాడో అనే తల్లడిల్లిపోయారు. తన విశ్వం ఏ విషాదానికీ లోనుకారాదు. ఏ అవసరాన్నీ అరికట్టుకోరాదు. రామనాథంగారి మనసు కొడుకుమీది వాత్సల్యంతో ఆర్ద్రమైపోయింది. మనసు పొరల్లో మమకారం గట్లు తెంచుకుంది. ఈ చరమ దశలో తను ఏ వసారాలోవున్నా గడిచిపోతుంది. ఈ జానెడు పొట్టకోసం ఏ పాటుపడ్డా సరిపోతుంది. వాడు ఉదయించే సూర్యుడు. తాను అస్తమించే వెలుగు. వాడికోసం, వాడి వెలుగుకోసం తను ఈ ఇల్లు అమ్మివేయక తప్పదు. ఈ నిర్ణయంతో రామనాథంగారి మనసుకు ఊరట లభించింది. మనసులోని అన్ని ఆరాటాలూ సర్దుమణిగినై. కొడుకుమీది మమకారాలు ఒడ్డులొరుసుకు ప్రవహిస్తుంటే ఆ రాత్రి హాయిగా, తృప్తిగా నిద్రబోయారు రామనాథంగారు.

ఆ ఉదయం చలపతికి తన నిర్ణయం చెప్పటానికి పోస్టాఫీసు వైపు బయలుదేరారు రామనాథంగారు. వేణుగోపాలస్వామి గుడి ప్రాకారం క్రిందకు వచ్చారు. గాలిగోపురం మీద పక్షుల కోలాహలం. పిల్లలకు పెద్ద పక్షులు ముక్కుతో ఆహారాన్నందిస్తున్నై. అప్యాయతను, అనురాగాన్ని వాటి భాషలో వర్షిస్తున్నాయి. ఆ దృశ్యాన్ని చూసిన రామనాథంగారి మనసు పరవశించింది. అణువణువునా పులకరింత కల్గింది. పెద్ద పక్షులు పిల్లలకు ఆహారాన్నందివ్వటం సహజం. అంతేగాని పిల్లలు పెద్ద పక్షుల ఆకలిని. అవసరాల్ని తీర్చినట్లు తానెక్కడా కనలేదు, వినలేదు. విశ్వం విషయంలోనూ ఇంతే. తాను వాడిమీద ఆధారపడటంకన్నా, తానే వాణ్ణి ఆదుకోవాలి. ఉడిగిపోయిన ఆ ప్రాణంలో కొత్త ఆశలు నింపుకొని ఉత్సాహంగా ముందుకు సాగిపోయారు రామనాథంగారు.

"ఆ ఇల్లుకూడా అమ్మేస్తే ఎక్కడుంటారు మాస్టరుగారూ?"

"నా కేమిటి చలమయ్యా, చరమదశలో వున్నవాణ్ణి. నేడో రేపో వెళ్ళిపోయేవాణ్ణి. నాకు ఆశ్రయాలేమిటి? బంధాలేమిటి?"

కొడుకుమీది వాత్సల్యాను రాగాలతో నిలువెల్లా పరవశించిపోతున్న రామనాథంగారు ఉన్మాదస్థితికి చేరేరేమో అన్న సందేహంలో పడిపోయాడు చలమయ్య. అతని మనసు మాస్టరుగారి విషయంలో స్థాణువులా మారిపోయింది. ప్రస్తుతం ఏ విషయంలోనూ, రామనాథంగారి ఆవేశానికి, ఆలోచనలకు అడ్డు చెప్పటం మంచిదికాదనుకొన్నాడు చలమయ్య.


"మాస్టరుగారూ ఈ పని కాగానే మీ ఇంటికే వస్తాను. అన్ని విషయాలూ మాట్లాడుకొందాం."

"మన విషయాలు ఎప్పుడూ వున్నవేగా. ముందు ఆ ఇల్లు కొనేవాళ్ళెవరన్నా వుంటే వెంటనే నా వద్దకు పంపు. ఈ ఒక్క సహాయం చేసిపెట్టు" దాదాపు ప్రాధేయపడుతూ అడుగుతున్న రామనాథంగార్ని చూసి చలమయ్య గుండెలు బాధతో ఊగిసలాడాయి. అతని కళ్ళల్లో నీటి చెమ్మ.

"సరే మాస్టారూ."

తృప్తిగా వెనుదిరిగారు రామనాథంగారు. ఇప్పుడాయన మనసు నిర్మలాకాశంలో తెల్లని మేఘంలా అతి తేలిగ్గా వుంది.

ఆ రాత్రి విశ్వం పస్తున్నట్టుగా టెలిగ్రాం అందుకొన్న రామనాథంగారికి



"ఒక శిల్పం"

ఫొటో : శ్రీ యస్. రామయ్య. హైదరాబాదు

కంటిపై కునుకు రాలేదు. ఉన్న పళంగా దేనికో ఈ రాక. మీ బాధ్యత మోయటం ఇహముందు నా వల్లకాదని ముఖమ్మీద చెప్పటానికేనా? విశ్వం వస్తున్నాడన్న పారవశ్యంతో, ఏమి వినవల్సివస్తుందో నన్న పరితాపంతో ఆయన తల్లడిల్లిపోయారు. "ఈ ఆఖరి అధ్యాయంలో ఏ నిప్పులూ చిందించకు భగవాన్" అంటూ పదే పదే భగవంతుణ్ణి వేడుకొంటూనే ఆ రాత్రి గడిపేశారు రామనాథంగారు.

తెల్లారి లేస్తుండగానే విశ్వం వచ్చాడు. వస్తూనే నాన్నా అంటూ రామనాథంగారి కాళ్ళకు లుంగలా చుట్టుకుపోయాడు. రామనాథంగారి కిదేమీ అర్థంగాక క్షణ కాలం విభ్రాంతిగా విశ్వంవేపు చూస్తుండిపోయారు. ఆ తర్వాత తెప్పరిల్లి ఆప్యాయంగా కొడుకు తలమీద నిమిరి పైకి లేవనెత్తారు. ఆయన గుండెల్లో దాగిన పుత్రవాత్సల్యం పొంగులా తన్నుకొచ్చింది. ఆనందం వారధి తెంపుకుని నరాల్లో వెల్లువై పారింది.

"నాయనా విశ్వం. ఇల్లు అమ్మకానికి పెట్టాను. నేడో రేపో పనైపోతుంది. నమయానికి నీవు వచ్చావు. ఈ రెండు రోజులూ వుండి ఈ పనులన్నీ నీవే స్వయంగా చూసుకో తండ్రీ."

తృప్తిగా, నిండుగా అంటున్న రామనాథంగారి మాటలతో విశ్వం వయసు కూడా మరిచి బావురుమన్నాడు.

రామనాథంగారు తెల్లబోయి కొడుకు వైపు చూశారు. ఆయన ముఖం ఆవేదనతో అల్లుకుపోయింది.

"నాన్నా, ఈ వయసులో నీకు అండగా, ఆసరాగా వుండి, పువ్వులా చూసుకోవల్సిన నిన్ను, నా దైవాన్ని ఇక్కడ వుంచి, దూరంగా వెళ్ళిపోయా న్నేను. ఏదో ఇంత డబ్బు నాకు వీలున్నప్పుడల్లా పంపి, నీ కడుపుకిది చాలదా అని నిర్లిప్తంగా నిర్లక్ష్యంగా వుండిపోయాను. నాన్నా నేనెంత స్వార్థపరుణ్ణి. మూర్ఖుణ్ణి. చలమయ్యగారు నేను నీకు డబ్బుగూర్చి వ్రాసిన ఉత్తరాలన్నీ పంపి నా కళ్ళు తెరిపించారు. నాకవసరం వున్నా, లేకున్నా "నాన్నా డబ్బు పంపు" అని నేను వ్రాయటంతోనే అడిగిన దానికన్నా అధికంగానే పంపే వాడివి. ఆ డబ్బు పంపేటప్పుడు నీ వెన్ని ఇబ్బందులు పడేవాడివో, ఎవరి ముందుకెళ్ళి యాచించే స్థితి నీ కేర్పడేదో కూడా తెల్సుకోలేని దిక్కుమాలిన స్థితి నాదప్పుడు. జలగలాగా నీ రక్తాన్ని అట్లా జుర్రుకొని నా చదువు ముగించుకొన్నాను. ఇప్పుడు నీవు. కేవలం నీ జీవితాన్ని నెట్టుకుపోవడానికి. ఆప్యాయతతో ప్రేమతో చనువుతో "నాన్నా డబ్బు పంపు" అని నాకు వ్రాస్తుంటే నేను చేస్తున్నదేమిటి? ఏనాడైనా సవ్యంగా. సంతోషంగా నీకు పంపగలిగానా? ఆ వంకా ఈ వంకా చెప్తూ మానసికంగా నిన్ను హింసపెడ్తూ వచ్చాను. చివరకు తాతలు కట్టించిన ఈ యిల్లు అమ్మమని నీకు వ్రాసే టంతటి నైచ్యానికి దిగజారాను. బంగారమని నన్నుగూర్చి నీవు కలలు గన్నావ్ నాన్నా. నేను ఇత్తడిగా నిరూపించుకొన్నాను. మంచి ఫలా లిస్తుందని నీవు ఆశతో పెంచిన చెట్టు కుక్కమూతి పిందెలు వేసింది నాన్నా. నాన్నా; నాది ఒక్క ప్రార్థన. నువ్వు నాతోపాటే వుండాలి. పెద్ద దిక్కుగా వుండి అన్నిటా నన్ను ఆశీర్వదిస్తూ వుండాలి. నా ఈ కోరికను నువ్వు కాదంటే నాకు అధోగతి తప్పదు. ఏ ఇంత కాంతీ లేక పిచ్చివాణ్ణయిపోతాను. నీ కోడలుకూడా నిన్ను వెంటబెట్టుకు రమ్మని మరీమరీ చెప్పి పంపింది. నా యీ కోరికను కాదనపుగా నాన్నా" అంటూ ప్రాధేయపడుతున్న విశ్వాన్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు రామనాథంగారు. అణువణువూ తన చేతితో స్పృశించి సంతోషంతో ఉక్కిరిబిక్కిరై పోయారు. ఆయన కన్నుల్లో నీటిధార. అంత ఆనందం తటుకోలేని ఆ ముసలి గుండె నుంచి మమకారం అట్లా తన్నుకొచ్చింది; ఆయన గుండెల్లోగూడుకట్టుకున్న పుత్రవాత్సల్యం ఏరులై సెలఏరులై ప్రవహించింది. ఇంతకు మించిన అదృష్టం ప్రపంచంలో వేరే ఎక్కడ పుంటుందన్నంతగాఆయన కళ్ళు వెలిగిపోయాయి.

"నాన్నా నా కోరిక మన్నించావా?" తిరిగి అర్థించాడు విశ్వం.

"అట్లాగే నాన్నా. నువ్వు చెప్పినట్లే చేస్తాను. నీ సుఖం, తృప్తి కంటే నాక్కావల్సింది వేరే ఏముంది తండ్రీ. నీతో పాటే వస్తాను."

తన్మయత్వంతో అంటున్న రామనాథం మాస్టరు గారిని చూసి అప్పుడే సుమ్మంలో అడుగుపెడుతున్న చలమయ్య తృప్తిగా శ్వాస పీల్చి వదిలాడు.

★